చిప్‌గా వెళ్ళి పోలీసులకి రిపోర్టిచ్చి మావారిని పట్టించి నిండుప్రాణాలు తీయించాడు. మాలపల్లె మీద పట్టపగలు దాడిచేయించాడు. పోలీసులు యిద్దరాడవాళ్ళని ఎంతఘోరంగా చెరిచారో మీకు తెలియదూ? కరణం రికార్డులో పెద్దరెడ్డి తనపేరు వ్రాయించుకుని, పొలం మాలవాళ్ళచేత సాగు చేయిస్తూ మీకే పట్టాయిస్తానని అంతా భుక్తం చేసుకున్నాడు. దీనికి ఎదురు తిరిగినందుకేనా యీ ఘోరాలు?" వీరపత్ని ప్రశ్నించింది.

"ఎదురుదెబ్బతియ్యడం మనలక్ష్యమన్నమాట!" కృష్ణయ్య అడిగాడు.

"ఖచ్చితంగా. రక్తానికి రక్తం కోరుతుంది మా పార్టీ" స్పష్టంగా జవాబిచ్చాడు మరో యువకుడు.

"ఇంతకూ బసవయ్య ఎందుకు పట్టించాడో మీకు తెలియకపోదు. వెనుక 1942 ఆగస్టు ఉద్యమంలో ఆయనతమ్ముడు పాపం యింట్లోదాక్కుంటే మీవాళ్లు పట్టించారు. మీరే స్వయంగా ఆ పని చేస్తే పరువు పోతుందని ప్రచారానికనే సాకుతో బైటవూళ్ళ కమ్యూనిస్టుల్ని పిలిపించి పట్టించి ఏమీ తెలియనట్టు నంగనాచిలా ప్రవర్తించారు. దానికి ఆయన పగతీర్చుకున్నాడు సరిపోయింది. ఇక పెద్దరెడ్డి చేసింది అన్యాయమేనని వొప్పుకొంటాను. కాని పిరికివాళ్ళలా అర్థరాత్రి ఆడవాళ్ళ మీద దాడిచేయడం గొప్పా? ఇక పాలేర్ల సమ్మె సంగతి చెప్పక్కర్లేదు" అన్నాడు కృష్ణయ్య.

"నిజంచెవుతున్నా వినండి. బసవయ్య తమ్ముడిని మావాళ్ళు ఎవరో పట్టించి యిచ్చారనడానికి ఏ మాత్రం ఆధారంలేదు. కేవలం మీకు అలా తోచింది. మీకేకాదు. జనానికంతా ఆనాడు అదేవిధంగా తోచింది. దానికి కారణం మీమీద నిర్బంధాలు తీసివేసి, వాటిని కాంగ్రెసువాళ్ళమీద ప్రయోగించడమే. మాకువున్న స్వేచ్ఛతో మేం కాంగ్రెసుకు వ్యతిరేకంగా ప్రచారంచేసేసరికి మీ అందరికీ అలా తప్పుఅభిప్రాయం కలిగింది. ఇక పాలేర్లసమ్మె అంటారా! అది తప్పనిసరి. ఎందుకంటే కరువుతో మాడిపోయేజనం. దొమ్మీలు, దోపిడీలు జరక్కుండా అలా శాంతంగా పరిష్కరించాం. మీతోపాటే మేమూ రేటు పెంచాం. వాళ్ళకంటె కాస్త వున్నవాళ్ళం గనుక త్యాగం చెయ్యక తప్పదు." సమర్థించింది వీరపత్ని.

"ఏమో మీరిచ్చామంటారు. మీరూ మీరూ ఒకటి. లోపల ఏం కూడుపుఠాణీజరిగిందో ఎవడికి తెలుసు? కూలీలు తలోవిధంగా చెప్తున్నారు. బసవయ్య తమ్ముడిని మీరు పట్టించింది ఖాయం. ఈ వూళ్లోపుట్టి, యీవూళ్లో పెరిగి, యీవూళ్లో చావడానికి సిద్ధంగావున్న నాకు కళ్ళుగప్పలేరు మీరెవరూకూడ... మధ్యతరగతి రైతుల్ని మీరు నానాఅవస్థలు పెడతారు. అదిమాత్రం ఖాయం. పైవాళ్ళకి డబ్బు, పోలీసుబలగం, అన్నీ అందుబాటులో వుంటాయి. క్రిందివాళ్ళని మీరేదో వుద్ధరిస్తామంటారు. ఎటొచ్చీ ఏబలంలేని మమ్మల్ని హతమార్చుతారు మీరిద్దరూకూడా. అందులో మీకు మధ్యతరగతిరైతులంటే, ప్రజలంటే చచ్చేమంట. సమిష్టి వ్యవసాయం పేరుతో వున్నకాస్తా కాజేస్తారు. అయినా యీ గ్రంథమంతా ఎందుకులెండి. రాత్రికి మా రెండో అబ్బాయి, కోడలు వొస్తారు. ఇద్దరూ బాగా చదువుకున్నవారు. నాకు వూళ్లోరాజకీయాలు, చుట్టుప్రక్కల వూళ్ళల్లో మనుష్యులసంగతి తెలిస్తే, వాళ్ళకి దేశదేశాల రాజకీయాలు సిద్ధాంతాలు క్షుణ్ణంగా తెలుసు. అంతా సంప్రతించుకుంటాంలెండి. పాపం ఆడవాళ్ళు శ్రమపడి వొచ్చారు. మాట యివ్వలేనందుకు క్షమించండి" అన్నాడు.

"తప్పదులెండి యిహ. గతమంతా మరిచిపోండి. ఈ మూడేళ్ళలో పోనీ, మేమేమీ హత్యలు, దోపిడీలు చెయ్యలేదుగా. ప్రస్తుతం ధరలు బొత్తిగా పడిపోయాయి. మనకు కావాల్సిన ప్రాజెక్టులు సున్నచుట్టారు. మీరేపనిమీద బస్తీ వెళ్ళాల్సినా ఆఫీసుల్లో లంచాలు పోస్తేనేగాని పనులవవు. మీ అబ్బాయిలు ఎల్లకాలం మిమ్మల్నే కనిపెట్టుకుని యింటిపట్టున వుండాలంటే యీ కాంగ్రెసు గవర్నమెంటు పడనివ్వడంలేదు. కమ్యూనిస్టులు అధికారంలోకొస్తే యిలాంటివన్నీ మీకనుకూలంగా పరిష్కరిస్తాం. తప్పకుండా మాకే మీవోటు" మరీమరీ చెపుతూ గడపదాటారు వీరపత్నులు, వీరమాతలు, వగైరావగైరా బృందం.

ఆ రాత్రి కృష్ణయ్య కొడుకు రాజారావు, కోడలు లక్ష్మి వొచ్చారు. వాళ్ళవోట్లుకూడా అక్కడే వున్నాయి.

"ఏరా వోటుసంగతి ఏమిటిమరి? చంపేస్తున్నారు రెండువైపులా" కృష్ణయ్య ప్రస్తావించాడు కొడుకు దగ్గిర.

"ఎట్లావుందేం అసలు మనవూళ్లో వైఖరి?" సంగతి తెలుసుకోవాలని రాజారావు అడిగాడు.

"ఎలావుంటుంది? ఇదివరకు పెద్దరెడ్డి కాంగ్రెస్, నాగయ్య లోక్ పార్టీ తరఫునా ప్రచారం చేశారు. ఇప్పుడూ యిద్దరు వకటేగా. వాళ్ళ చీలిపోయిన వోట్లు మళ్ళీ కలుస్తాయి. ఇంటింటికీ ప్రచారం చేస్తున్నారు యిరుపక్షాలుకూడ. కమ్యూనిస్టులు మహా జిత్తులమారి వాళ్లురా. మనబోటి వాళ్ళదగ్గిర బ్రతిమిలాడుకొంటూరు. ఆ పాలేర్లలోనూ, మాల వాళ్ళలోను లోలోపల రహస్యంగా ఏమని ప్రచారం చేస్తున్నారో విన్నావా?"

"ఏం ఏమని చేస్తున్నారేం?" లక్ష్మి ఆత్రుతగా అడిగింది.

"ఇదివరకులాగే కట్టుగా వాళ్ళపార్టీకి వెయ్యాలిట. వెయ్యకపోతే వాళ్ళకి బంజర్లు యివ్వరట. అధికారంలోకి తప్పకుండావొస్తారుట యీమాటు. అప్పుడు యీ వెయ్యొద్దని ప్రచారం చేసిన కుల పెద్దల్ని "బసవయ్య" దగ్గిరికి పంపిస్తారుట! కాంగ్రెసుకి వోటుచేసే పాలేర్లకి వీళ్లు అధికారంలోకి రాగానే రేట్లు పూర్తిగా తగ్గిస్తారుట. అలాగే కౌలుమీద బ్రతికే పేదరైతుల గొడ్లు, గోద, లావుక్కని మాలవాళ్ళకిప్పిస్తారుట. పొలాలు వాళ్ళకి పంచరుట. మరి మన దగ్గిర అలా మాట్లాడలేరే! ఇహ కాంగ్రెసు క్యాండిడేటు సరే సరి. 300 ఎకరాలభూమి, రెండు మేడలు, దీనికి తగ్గట్టు తాగుబోతు, వ్యభిచారి. పేద, మధ్య, ధనికుడు, అనే భేదంలేదు. ఎవరినైనా ముంచుతాడు. భస్మాసురహస్తం. పోయినసారి స్వతంత్రంగా పోటీచేసి వోడిపోయాడు. మరి మనం ఏంచేద్దామంటావ్?" వివరంగాచెప్పి అడిగాడు కృష్ణయ్య.

"ఏదో ఆ సోషలిస్టు వున్నాడుగా యిద్దరి మధ్యా. ఎలాగూ గెలవడులే, అయినా వోట్లు పారేసుకోవడమెందుకూ? వాళ్ళల్లోనూ చాలా మతాలున్నాయి. రోజుకొకడు చేరుతాడు, ఘుడియకొకడు బైటికి పోతాడు. ఎవడిష్టమొచ్చినట్లు వాడు మాట్లాడుతాడు. ఎవడు నాయకుడో, వాళ్ళ విధానమేమిటో సరిగా ఒక్కడికీ తెలియదు. అయినా పాపం అనవసరంగా సమ్మెలు, దోపిడీలు, కొట్లాటలు, హత్యలు, స్టాలిన్, లెలిన్ల భజన, వీళ్లకు లేదులే. మనదేశం, జాతి, నాయకులు, అంటే చాలా గౌరవాభిమానాలున్న పార్టీ కాంగ్రెసు తర్వాత యిదే. ప్రస్తుతానికి ఏదో గ్రుడ్డిలోమెల్ల వీళ్ళకేవేస్తే పోతుంది." అన్నాడు రాజారావు.

"ఆలాచేస్తేనే మంచిది" సలహాయిచ్చింది లక్ష్మి.

తెల్లవారుతూండగా వూళ్లోకి మూడు పెద్ద లారీలొచ్చాయి. అందరికీ మెలుకువవొచ్చింది. వాకిట్లలోకొచ్చారు. కొందరు సరాసరి లారీలు మాలపల్లి కెళ్ళడం చూశారు. కృష్ణయ్యా రాజారావూ, అనుమానించినంతా జరిగింది.

"తోయ్యండ్రా లారీల్లోకి వొక్కొక్కళ్ళని. వెధవ సన్నాసులకి వీళ్ళకి వోట్లేమిటి?" ఆజ్ఞాపించాడు నాగయ్య. పెద్దరెడ్డి, మరి యిద్దరు భూస్వాములు, కూడా అక్కడే కర్రలుపుచ్చుకుని బెదిరిస్తున్నారు.

"యేం రావంటే మర్యాదగా ఎల్లండి. లేకపోతే తగుల్తయ్! మేమేమన్నా మీ కడ్డమొచ్చినమా?" వాళ్ళనాయకుడు గర్జించాడు.

"ఏంటా తగిలేదీ. ఊస్తారేం? ఊఁ...లాగండి కర్రలు లారీలోంచి." పెద్దరెడ్డి హుకుం జారీ అయింది వాలంటీర్లకి.

"చాలా అన్యాయం నాగయ్యా" కేకేశాడు వెనకనుంచి కృష్ణయ్య.

"ఆగండి వాళ్ళ జోలి మీకెందుకు?" మరో రెండు కంఠాలు వురిమాయి.

"తగ్గండోయ్-పెద్ద మీరుపోతే పొండి. కావలస్తే కమ్యూనిస్టుకే వేసుకోండి. మీ జోలికెవడొచ్చాడు?" నాగయ్య ఘాటుగా జవాబిచ్చాడు.

"దమ్ములుండొద్దూ మాబోటివాళ్ళ జోలికి రావడానికి? కూలిజనంకాబట్టి ఒంటికాలిమీద లేస్తున్నారు వాళ్ళమీదకి. ఏ పోలీసు మిమ్మల్ని ఆదుకుంటాడో చూస్తాంగా" రాజారావు వుగ్రుడైనాడు.

"పోవయ్యా నువ్వు. అన్నిటికీ అడ్డుతగుల్తావుంటావ్." అని మాలవాళ్ళవైపు తిరిగి "ఎక్కండి లారీలో" అని వాలంటీర్లకు సైగచేశాడు పెద్దరెడ్డి. వాలంటీర్లు విజృంభించారు. అచటవున్న మాలవాళ్లు, కమ్యూనిస్టు వాలంటీర్లు, కొందరు వూళ్లో పాలేర్లు, ఎదురుదెబ్బ తీశారు. రెండు

వైపులా గాయాలు తగిలాయి. లారీలు నిండి పోయాయి. అవి ఎటో దారితీశాయి. ఉభయ పక్షాల పత్రికలకీ కావలసినంత మేత దొరికింది.

రాజారావు సైకిల్ మీద రెండు మైళ్ళ దూరంలో వున్న పోలింగు బూతుకు వెళ్ళాడు. ఇద్దరు కమ్యూనిస్టులుకూడా పరుగెత్తారు. నెమ్మదిగా బండిలో కృష్ణయ్య, పెళ్లాం, వెళ్లారు. వోటు చేసేసరికే పదకొండయింది, రిపోర్టుయిచ్చి పోలీసులొచ్చేసరికి సాయంత్రం ఆరయింది. ఆహా, శాంతిభద్రతల స్థాపనలో ఎంతశ్రద్ధ! కొందరు అరెస్టయ్యారు. పోలీసు కాపాలా వున్నారు.

"ఈ నాగయ్య, పెద్దరెడ్డిమనమీద పగపట్టుతారేమో!" కృష్ణయ్యభయపడుతూఅన్నాడు ఆరాత్రి.

"ఏడిశారు. ఏంచేస్తారు వీళ్ళమొహాం? ఇదేం రష్యాకాదు అడ్డమొచ్చిన వాడినీ, ఎదురు చెప్పిన వాడినీ కాల్చిపారెయ్యడానికి! మన రాజ్యాంగం, కోర్టులు, ఎలాంటివాళ్ళకైనా బుద్ధిచెపుతాయి. ఎన్నిసార్లు గవర్నమెంటు వోడిపోలేదు కోర్టులో! అవి భద్రంగా వున్నంతకాలం ఫరవాలేదు. అంత మాత్రాన వుత్తమోత్తమమైనది కాదు మన రాజ్యాంగం. కాని తిండి, వుద్యోగం మినహా, మనకున్న స్వాతంత్ర్యంలో వెయ్యోవంతు రష్యాలో లేదు. మనబోటి వాళ్ళ బలం పెరిగినకొద్దీ, యిలాంటి నాగయ్యలనూ, కమ్యూనిస్టులనూ త్వరలోనే సమాధిచేస్తాం" కుండ బ్రద్దల గొట్టినట్లు చెప్పాడురాజారావు. అనేక గ్రామాలనుంచిఇలాంటి వార్తలే రావడంవలన ఎన్నికల ఫలితాలెలా వున్నాయో కొట్లాట ఫలితాలెలావుంటాయో అని ఎదురుచూస్తున్నారు గ్రామస్థులు. 1948-50 చరిత్ర తిరిగి తప్పదా అని భయపడేవాళ్లు లేకపోలేదు.

స్కెచ్

# శానిటోరియమ్ జీవితం

"ప్రసూన"

వారం రోజుల్లో శర్మ ఇంటికి వెళ్ళిపోతున్నాడు.

పదహారు నెలలు శానిటోరియంలో జీవితం గడిపాడు. కాని ఆశ్చర్య మేమిటంటే, ఇన్నాళ్ళ తర్వాత పోతున్నా అతనిలో ఏవిధమైన సంతోష చ్ఛాయలూ లేవు. 'వాకింగు'కు కూడా ఎన్నడూ పోడు. పొద్దున సాయంత్రం మహబూబ్ వార్డుకు వెళ్తాడు. తిరిగి వార్డుకు వస్తాడు. వార్డులో ఉన్నంతసేపూ ఏదో ఒక పుస్తకం చదువుతూనే ఉంటాడు. ఆ చదివే పుస్తకాలైనా ఏవో సామాన్యమైన నవలలా అంటే కాదు. అసలు టి. బి. పేషెంటు ఎక్కువగా ఆలోచనచేయడం మంచిదికాదు. అందుకనే తీవ్రంగా ఆలోచించవలసిన అవసరంఉన్న పుస్తకాలు చదవగూడదు. కాని శర్మ చదివేవి అన్నీ తాత్విక గ్రంథాలు మొదలైనవి.

మహబూబ్ అంటూండేవాడు శర్మని అర్థంచేసుకోవడం కష్టమని. దానికి కారణమిది. మొదట్లో శర్మకి 'వాకింగు' ఇవ్వగానే ఆంధ్ర పేషెంట్లతోనే తిరిగేవాడు. కాని వారిలో కొంతమంది ప్రవర్తన జుగుప్సాకరంగా కన్పించింది. ఎప్పుడూ శానిటోరియంలో నర్సులనుగురించీ, ఏ నర్సుకు, ఏ కాంపౌండరుకు సంబంధమున్నది, ఇలాంటి విషయాలు మాట్లాడుకునేవారు. అంతేకాదు. ఎవరన్నా ఒక అందమైన ఆడపేషెంటు పోతుంటే ఆమె కర్థంగాని భాషలో వెనకనుంచి హేళన చెయ్యడం.

ఒకనాడు శర్మ వార్డుకు తిరిగివస్తుంటే, యెదురుగా ఉన్న వార్డులోంచి ఒకాయన పిల్చాడు. ఆయన యూదుడు; పాశ్చాత్య నాగరికత అలవడినవాడు. ఎంతో పెద్దమనిషిలాగా కనిపించాడు. శర్మని అడిగాడు: "నీకు ఇంగ్లీషు వచ్చునా" అని. శర్మకు నవ్వొచ్చేటంత పనైంది. బి. ఏ. రెండవ సంవత్సరంలో టి. బి. మూలాన చదువు ఆపవలసి వచ్చింది. శర్మకి ఆయనతో స్నేహం ఎక్కువైంది. క్రమంగా శర్మకి పాశ్చాత్య సంప్రదాయంకలవాళ్ళ, యిన యూదులతో, ఆంగ్లో-ఇండియన్‌లతో స్నేహమైనది. వారితోనే తిరుగుతుండేవాడు. శర్మ వేషంలో కూడా మార్పు వచ్చింది. పేంటు, షర్టు, చెప్పులువేసుకు తిరిగే శర్మ 'షూజ్'ధరించడం ప్రారంభించాడు. "ఇన్‌షర్టు" కూడా వేయటం మొదలుపెట్టాడు.

కాని రోజులు గడచినకొద్దీ వారియొక్క నిజ స్థితి కూడా బయటపడసాగింది. వాళ్ళకి మనవారి వలె ఇతరులనుగూర్చి చెప్పుకునే జాడ్యంలేదుగాని, అంతకంటె అధ్వాన్నమైనది ఇంకో దుర్గుణం ఉంది. స్త్రీ పురుషసంబంధ విషయాలు ఎంతో తుచ్ఛంగా వర్ణించి చెప్పుకునేవారు. వారు యువకులుగా వున్నప్పుడుజరిపిన'వీరకృత్యాలు'రసవత్తరంగా వర్ణించుకుని ఆనందించేవారు. ఈవిధంగా శానిటోరియంకువచ్చినప్పుడు ఎంతో అమాయకుడుగా ఉన్న శర్మకు, కలకత్తాలో వేశ్యాగృహాల్లో "ఎంగేజ్" అయిఉన్న సమయాల్లో ఏ రంగుదీపం వెలుగుతుందోకూడా తెలిసేజ్ఞానం వచ్చింది.

శానిటోరియం పేషెంట్లువద్దనుంచి ఫుట్ బాల్ చందా వసూలు చేస్తున్నారు. వసూలుచేయటానికి బయలుదేరినవారికి నాయకుడు ఒక ఆంధ్రమహాపురుషుడు. ఆయన శర్మదగ్గరకివచ్చి తన ఆంగ్ల భాషాప్రావీణ్యాన్ని మిగత బెంగాలీ పెద్దమనుష్యుల ముందర చూపించాలని శర్మని చందాకోసం వచ్చీరాని ఇంగ్లీషులో అడిగాడు. శర్మకూడా ఇంగ్లీషులోనే చెప్పాడు వీల్లేదని. దానితో ఆయనకు మండింది 'నేను వెళ్ళేటప్పటికి ఆయన పోజుగా నాతో ఇంగ్లీషులో మాట్లాడుతాడా' అని. తెలుగంటే సరిగా తెలియని ఇంకో పెద్దమనిషి శర్మని 'ఆంధ్రా యూరపియన్' అనేవాడు.

కాలం గడుస్తోంది. ఈ శానిటోరియం ఒక విధంగా జైలులాంటిది. సక్రమంగా ప్రవర్తిస్తే అంటే సరిగా విశ్రాంతి మొదలైనవన్నీ తీసుకొంటే కొద్దికాలానికే విడుదల జరుగుతుంది. ఆ ప్రవర్తన సరిగా లేకపోతే ఎక్కువకాలం ఈ బందిఖానాలో ఉండాలి. అసలు ఈ శిక్ష అనేది శానిటోరియంకు రాకపూర్వం చేసిన పనులమీదకూడా ఆధారపడి ఉంటుంది; పూర్వజన్మకృతమన్నట్లు. ఈ విధంగా ఎక్కువ తప్పుచేసినవాడు 'ఆపరేషన్ బ్లాక్'కు పోతాడు. అది కఠినశిక్ష అన్నమాట.

ఈ విధంగా కొత్తబంధితులు వస్తుంటారు. పాత వాళ్లు విడుదలౌతుంటారు. శర్మకు ఇంతవరకు స్నేహితులుగా ఉన్నవారిలో స్త్రీలెవరైనా ఉంటే వాళ్ళు భర్తలతో ఇక్కడ ఉన్నవాళ్లు. ఇప్పుడు కొత్తగా ఒక ఆంగ్లోఇండియన్ స్త్రీరత్నం శానిటోరియంకు వచ్చింది. వయస్సు సుమారు 40 సంవత్సరాలు. అసలే లావుపాటి శరీరం. దానికి తోడు రోతపుట్టించేటట్లు "మేకప్"కూడా చేస్తే ఇక ఆ స్వరూపాన్ని గూర్చి చెప్పనక్కరలేదు. ఆమెభర్త ఆమెను శానిటోరియంలో దించి వెంటనే వెళ్ళిపోయినాడు. శర్మ ఈ జట్టులో ఉన్నాడు కనుక ఈవిడతోకూడా పరిచయమైంది. (కొత్త రోగి ఎవరన్నావస్తే ఆ రోగి రాష్ట్రానికి, లేక ప్రాంతానికి సంబంధించిన ఇతర పాత రోగులు వెళ్ళి పలకరించి, ధైర్యం చెప్పడం అలవాటు.)

ఇంతవరకు శర్మతో పరిచయమున్న స్త్రీలు భర్తలతో ఉన్నవారు గాబట్టి శర్మయొక్క శీలానికేమీ అపకీర్తి తీసుకువచ్చే అవకాశం ఎవ్వరికీ లేకపోయింది. 'పోజు,' 'గర్వము' మొదలైన పదాలతోనే వదలి పెట్టేవారు. అంతగా అయితే 'ఈయనకు వాళ్ళేమైనా చుట్టాలా' అనేవారు. ఇప్పుడు శర్మమీద ద్వేషం ఉన్నవారందరికీ (ఈ ద్వేషం అంతా పాశ్చాత్యులతో తిరుగుతున్నాడనే) మంచి అవకాశం దొరికింది. అసలు శానిటోరియం, ఏదో ఇంగ్లీషుపుస్తకంలో అన్నట్లు పుకార్లకు పుట్టిల్లు. అట్లాంటివారిలో కొందరు శర్మకీ, ఆ నలుబదేండ్ల'యువతి'కీ, సంబంధం ఉందని పుకారు పుట్టించేరు.ఇక ఆ పుకారు శానిటోరియం మొత్తం ప్రాకిపోయింది. కాని శర్మ నిర్దోషి అని తెలిసినవారెవ్వరు?

కాని శర్మ అంటాడు: "వారితో స్నేహం నాకెంతో ప్రయోజనం కలిగించింది. వారెంత నీచులైనా మంచి ఆదర్శమంటే, ఆదర్శప్రాయమైన జీవితమంటే వారికి గౌరవముంది. వాళ్ళలో తిరిగినా కూడా, వాళ్ళలో ఒకడినిగా నన్నెన్నడూ ఎంచేవారుకారు. ఇక మనవాళ్ళతో అయితే, మన ఆత్మాభిమానాన్ని చంపుకుని, వాళ్ళకి దాసోహమని, వాళ్ళు చేసే పనులను హర్షించాలి. లేకపోతే వారిదృష్టిలో అపహాస్యం పాలుకావాలి. అంతకంటె ముఖ్యమైన విషయం ఇంకొకటి, వాళ్లు గడిపే తుచ్ఛజీవితాన్ని చూస్తుంటే, నా కనిపించేది: ఆ విధంగా జీవితం గడపడంకంటె ఆత్మహత్య మేలని. ఆ కారణంగా నాలోఉన్న జ్ఞానతృష్ణ ఎంతో ఎక్కువైంది. దానికి వాళ్ళకెంతో ధన్యుణ్ణి. అంతేకాదు. ఈ అపనిందను భరించటానికి కూడా సంసిద్ధుణ్ణి."

★